



సత్యనగర్‌కాలనీవాసులు భయభ్రాంతులకు గురికావొద్దు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చైతన్యపురి డివిజన్‌లోని సత్యనగర్‌కాలనీలో గల ఇళ్లు మూసీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయని వాటిని కూల్చివేస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఇక్కడి కుటుంబీకులు నమ్మవద్దని, బీఆర్ఎస్ మీకు ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం సత్యనగర్‌కాలనీ ఇళ్లవాసుల వినతి మేరకు ఆయన కాలనీలో పర్యటించారు. కొన్ని సంవత్సరాల క్రితం సత్యనగర్‌కాలనీలో స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అన్ని రకాల అనుమతులు తీసుకున్నాం. ప్రభుత్వానికి ఆస్తిపన్ను చెల్లిస్తున్నాం. కరెంటు బిల్లులు లక్షల్లో చెల్లిస్తున్నాం. ఇంకా ఇప్పటికీ అనేక ఇళ్లకు బ్యాంకు నుంచి తీసుకున్న లోన్‌లకు నెలవారి ఈఎంఐలు కూడా చెల్లిస్తున్నాం. ఇప్పుడు కొత్తగా మూసీ సుందరీకరణ పేరుతో సత్యనగర్‌కాలనీలోని ఇళ్లను అపార్ట్‌మెంట్లను కూల్చివేస్తారంటూ ప్రచారం జరుగుతుందని పలువురు మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యనగర్‌కాలనీలోని ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న ఏ ఒక్క కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురికావొద్దని, ఇక్కడి ఇళ్లను కూల్చాలంటే ముందుగా మమ్మలను దాటుకుని రావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్‌గౌడ్, త్రివేది పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


జ్ఞాపికలను బహూకరిస్తున్న స్కూల్ ప్రతినిధులు

ముగిసిన నేషనల్ సైన్స్ ఎక్స్‌పో


హైదరాబాద్ సిటీ: జి పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ దిల్‌సుఖ్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన భారత్ ప్రైడ్ 2024 నేషనల్ సైన్స్ ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సైన్స్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఇస్రో, ఎన్‌ఆర్ఎస్‌సీ, సీఎ్ సఐఆర్, ఎన్‌జీఆర్ఐ, ఎన్‌పీఎల్, ఎస్‌ఈఆర్‌సీ, ఐఎంఎంటీ, యూఐడీఏఐ (ఆధార్‌కార్డు), విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజి యం, నేషనల్ కౌన్సిల్ సైన్స్ మ్యూజియం, ఎన్‌ఐఎస్‌టీ, ఐఐటీఎం పూనే, ఎన్‌ఐఓటీ, ఎంఓఈఎస్‌తోపాటు అనేక ప్రముఖ సంస్థలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌లో వారి మోడల్స్‌ను ప్రదర్శించారు. మూడు రోజుల పాటు జరిగిన ప్రదర్శనను దాదాపు 50 వేల మంది విద్యార్థులు, ప్రజలు వీక్షించారని ఐఎండీ చాప్టర్ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న తెలిపారు. బెస్ట్ స్టాల్స్‌ను గుర్తించి వారికి బహుమతులు అందజేశామని ప్రిన్సిపాల్ హుల్యూర్ జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ ఎక్స్‌పోలో పాల్గొన్న సీఎస్ఐఆర్, ఐఎండీ శాస్త్రవేత్తలను సన్మానించారు.

సౌభాగ్యనగర్‌కాలనీ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సౌభాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ రత్లవత్ రాము ఎన్నికయ్యారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను మార్యద పూర్వకంగా కలిశారు.
























పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి

- ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతిపెద్ద ఐదు కులాల్లో ఒకటైన పద్మశాలీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారు సంపూర్ణంగా ఎదగాలంటే రాజకీయంలోనూ రాణించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఆటోనగర్‌లోని హరిణి వనస్థలి(డీర్ పార్క్) ఆవరణలో ఆదివారం పద్మశాలీ దసరా మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఈటలతో పాటు ఎమ్మెల్సీ ఎల్.రమణ, టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఇరవర్తి అనిల్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ సమాజానికి అవసరమైన రీతిలో వస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశాలీలు అడుక్కుని కాకుండా ఐక్యంగా హక్కులను సాధించుకోవడంతో పాటు బతిమిలాడకుండా రాజకీయంగా కూడా రాణించాలని సూచించారు. పద్మశాలీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. పద్మశాలీలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఇరవర్తి అనిల్ పేర్కొన్నారు. ఈ మేళాలో వివాహ పరిచయ వేదికతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, పద్మశాలీ దసరా మేళా కమిటీ ఛైర్మన్ కౌకుంట్ల రవితేజ, బొమ్మ రఘురాంనేత, రావిరాల సంధ్యారాణి, వర్షలీల, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ అధ్యక్షుడు కమర్తపు మురళి, వనం దుష్యంతల, గుంటక రూపా సదాశివ్, మాచర్ల రాంచందర్, గడ్డం లక్ష్మీనారాయణ, గుర్రం శ్రవణ్, జెల్లా సూర్యకాంత్, జెల్లా జగన్నాథం, చెరిపల్లి ప్రభాకర్, పొట్టబత్తిని నగేష్ పాల్గొన్నారు.



మేళాలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నా కూతురు ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించిన వారిని కఠినంగా శిక్షించాలి : విఠల్‌రెడ్డి

కొత్తపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తన కూతురు ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించిన ఆమె భర్త, అత్త, మామలను కఠినంగా శిక్షించాలని తిప్పాయిగూడ గ్రామవాసి, విశ్రాంత ఏఎస్ఐ వింజమూరి విఠల్‌రెడ్డి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితురాలి తండ్రి తిప్పాయిగూడ గ్రామవాసి వింజమూరి విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం, గడ్డం మల్లయ్యగూడ గ్రామానికి చెందిన బత్తుల పవన్‌కుమార్, తిప్పాయిగూడకు చెందిన నిఖితలకు ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. ఆమె తల్లిదండ్రులు వరుడికి 55 తులాల బంగారం, రూ.5 లక్షలు, వెండి సామగ్రి కట్నం కింద ఇచ్చారు. ఇంకా కట్నం కావాలని భర్త బత్తుల పవన్‌కుమార్, అత్త అలివేలు, మామ వాసుదేవరెడ్డిలు నిఖితను విపరీతంగా వేధింపులకు గురిచేశారు. విఠల్‌రెడ్డి మేడ్చల్‌లో ఉన్న తన ఇంటిని అల్లుడికి ఇచ్చాడు. కొన్నాళ్లకు పవన్‌కుమార్ ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లినా, ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడుతూ తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశాడు. తర్వాత విఠల్‌రెడ్డి బంగారం అమ్మేసి రూ.7 లక్షలనూ పవన్‌కుమార్‌కు ఇచ్చారు. పవన్‌కుమార్ భార్య నిఖితను, కుమారుడినీ అమెరికాకు తీసుకెళ్లాడు. అతడు వారిని అక్కడా విపరీతంగా వేధించి, ఇండియాకు పంపించాడు. నిఖిత, ఆమె కుమారుడు విఠల్‌రెడ్డి ఇంట్లోనే ఉండేవారు. ఫోన్‌లో, ప్రత్యక్షంగానూ మళ్లీ అత్తమామల వేధింపులు తాళలేక నిఖిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విఠల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన వృద్ధుడిని చేరదీసి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక తప్పిపోయిన వృద్ధుడిని చాదర్‌ఘాట్ పోలీసులు చేరదీసి మానవత్వాన్ని చాటుకున్నారు. అతని వద్ద ఉన్న ఆర్టీసీ సిటీ బస్సు టికెట్ ఆధారంగా అతని కుటుంబీకులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ నివాసి రాజు(65) శనివారం రాత్రి చాదర్‌ఘాట్ బస్టాపులో ఎటు వెళ్లాలో తెలియక అమాయకంగా తిరుగుతున్నట్లుగా స్థానికులు గుర్తించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వృద్ధుడు రాజును చేరదీసి అతని వివరాలను అడగగా ఏమి చెప్పలేకపోతున్నాడు. అతని వద్ద లభించిన ఆర్టీసీ సిటీ బస్సు టికెట్ ఆధారంగా ఎల్బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే వృద్ధుడు రాజు తప్పిపోయినట్లుగా అతని కుమారుడు సునీల్‌గౌడ్ ఫిర్యాదు ఇచ్చినట్లుగా తెలపడంతో చాదర్‌ఘాట్ పోలీసులు సునీల్‌గౌడ్‌ను సంప్రదించారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించగా వృద్ధుడు రాజు తన తండ్రి అని చెప్పి అందుకు సంబంధించిన ఆధార్ ఇతర పత్రాలను చూపించడంతో ఎస్ఐ అతడిని కుటుంబీకులకు అప్పగించాడు.



వృద్ధుడు రాజును అతని కుటుంబీకులకు అప్పగిస్తున్న చాదర్‌ఘాట్ పోలీసులు